క్లుప్తంగా

ఆకట్టుకున్న చిన్నారుల గొబ్బిళ్ల పూజలు


చిన్నారులతో గొబ్బిళ్ల పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసం సందర్భంగా గునుపూడిలోని బంట్రోతు వారి వీధిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా చిన్నారులతో గొబ్బిళ్ల సంబరాలను నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

షేక్ సాబ్జికి కన్నీటి నివాళి


ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఎమ్మెల్సీ షేక్ సాబ్జి సంస్మరణ సభను నిర్వహించారు. సాబ్జి ఆశయాల సాధనే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని యూటీఎఫ్ నాయకుడు జీవీవీ రామానుజరావు అన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ కుమార్ బాబ్జీ, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, జుత్తిగ నరసింహమూర్తి, జి.రామానుజరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పేరుపాలెం బీచ్‌కు వెళ్లే సందర్శకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాకతో అమ్మవారి ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దారి సమస్య పరిష్కారానికి కృషి

పాలకొల్లు అర్బన్: చర్చి సంఘస్తులకు, రైతులకు మధ్య గత కొంతకాలంగా నలుగుతున్న దారి సమస్యను ఉభయులకు సానుకూలంగా పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. యలమంచిలి మండలం కొంతేరు శివారు ఆకులవానిగరువు చర్చి సంఘస్తులను ఆదివారం ఆయన స్వయంగా కలుసుకున్నారు. సంఘస్తులు ఎదుర్కొంటున్న దారి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే ఈ దారి విషయంలో ఉన్న పోలీసు, కోర్టు కేసు వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10:30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఎ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: రానున్న ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కచ్చితంగా గెలుస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ధీమా వ్యక్తం చేశారు. పెద అమీరం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట కట్టుబడి పరిపాలన చేస్తూ దేశంలోనే పరిపాలన దక్షకుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికలకు రానున్న ఎన్నికలకు వ్యత్యాసం ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవాలన్నారు. మన పార్టీ అధికారంలో ఉంటేనే పదవులు పొందగలమని గ్రహించి నాయకులు కష్టపడి పనిచేయాలని కోరారు. పదవులు పొందిన వారంతా పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సేవ చేయగలమన్నారు. ఈసారి కచ్చితంగా ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ప్రజలంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడ లేరని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రానున్న రెండు, మూడు నెలలు కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యుని కల్యాణమహోత్సవాలు

వీరవాసరం: శ్రీ వల్లి దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు మండలవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తోలేరులోని శ్రీ వల్లి దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోనూ, తోకలపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోనూ, రాయకుదురు, కొణితివాడ, నడపన వారి పాలెం, వీరవాసరం, పంజా వేమవరం, మత్స్యపురి తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాల్లో కల్యాణోత్సవాలు వేడుకగా చేపట్టారు. ముందుగా స్వామి వారిని, అమ్మవారిని పెళ్లి కుమారులు,పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. ప్రత్యేక హోమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, చవాకుల సత్యనారాయణ మూర్తి, భైరవభట్ల మురళీకృష్ణ శర్మ, కోటిపల్లి వెంకటేశ్వర బాపూజీ, కాయల నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాలవానితిప్పలో ఘనంగా గణేష్ విగ్రహ ప్రతిష్ఠ


అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం


ఆకివీడు: సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని శివారు మాలవానితిప్ప గ్రామం ఆధ్యాత్మిక చింతనతో, వేదమంత్రాలతో మారు మ్రోగింది. గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రధాన అర్చకుల వేదమంత్రాల నడుమ మహాగణాధిపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కనుల పండుగ జరిగింది. గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు దంపతులచే గ్రామ పెద్దలు, భక్తులు సహకారంతో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అయ్యప్పస్వామి మాలదారులు సమీకృత భాగస్తులై ఆరాధించారు. శ్వేతవర్ణం గల పాలరాతి లక్ష్మీ గణపతి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉప ఆలయం మందిరం ఏర్పాటు చేసి ఆ మందిరంలో విగ్రహ దివ్య ప్రతిష్ఠను గావించారు. మహాగణాధిపతిని పూజించడం ఆరాధించడంవల్ల విద్యాబుద్ధులు, గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు భక్తుల కోరికలు తీరుస్తారని ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ గ్రామం అంతా ఆధ్యాత్మిక చింతనతో సుభిక్షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంతెన రంగరాజు, అయ్యప్ప మాలదారులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి మహోత్సవాలు

ఆకివీడు: మండలంలో వివిధ దేవాలయాలలో షష్ఠి మహోత్సవాలు సందర్భంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శాండ్ బెడ్ వాకింగ్ ట్రాక్ ప్రారంభం


శాండ్ బెడ్ వాకింగ్ ట్రాక్ ను ప్రారంభిస్తున్న సాగి ప్రసాదరాజు

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వాటర్ ట్యాంక్ చుట్టూ నూతనంగా నిర్మించిన శాండ్ బెడ్ వాకింగ్ ట్రాక్‌ను కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు సహజ సిద్ధమైన ఇసుక నేలలపై రోజులో కనీసం 15 నిమిషాలు వాకింగ్ చేస్తే రక్త ప్రసారం బాగా జరిగి సంపూర్ణ ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని నిపుణుల సూచనలు మేరకు దీనిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. చుట్టూ చెరువు, గట్టు పైన కొబ్బరి చెట్లు, ఆహ్లాదకరమైన ఇతర చెట్ల నడుమ వాకింగ్ ట్రాక్ ఉండటం నడక సమయంలోను ప్రకృతి సహజసిద్ధమైన గాలులు ఆస్వాదించేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ ట్రాక్‌ను విద్యార్థులే కాకుండా స్థానిక వాకర్స్ కూడా ఉపయోగించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, ఎస్‌వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు, డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు


ఎన్నార్పీ అగ్రహారంలో శ్రీరాముని అక్షితంలు ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి:అయోధ్య శ్రీరాముని అక్షింతాలకు మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.ఆదివారం గ్రామంలోని మెయిన్ విలేజ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా రామాలయం నుంచి శివాలయం వరకు అక్షింతలను భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఒకరి తరువాత ఒకరు తలపై మోస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని భక్తులు అనుభవించారు.గ్రామ సర్పంచ్ సూరవపు కనకదుర్గవెంకటాచార్యులు, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీశ్రీనివాస్ పాల్గొని స్వామివారి అక్షితలను మోస్తూ శివాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో సూరవరపు వెంకటాచార్యులు, గ్రామ పెద్దలు పాలతీర్థపు నర్సింగరావు,పానిపిరెడ్డి రామచంద్రరావు, దేవరకొండ రాము, నర్సయ్య, వార్డు సభ్యులు ముగ్గళ్ల సత్తిబాబు, నలభ రాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో..

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం కాషాయ వస్త్రాలు ధరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అయోధ్య శ్రీరాముని దివ్య అక్షింతలను మేళతాళాలతోను, డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా త్రిప్పి కనుల పండువగా నిర్వహించారు. శ్రీ కోదండ రామ ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాహితీవేత్త పెంకికి సత్కారం


పెంకి విజయ్‌కుమార్‌కు సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆకివీడు: కవి సమ్మేళనంలో తన కవితా గానాన్ని విన్పించి, ప్రేక్షకుల్ని ఆనందింపజేశారు ఉపాధ్యాయులు, సాహితీవేత్త పెంకి విజయ్ కుమార్. తాడేపల్లి గూడెంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రపంచ తెలుగు సాహిత్య-కళా ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాల్లో పాల్గొని వచన కవిత 'ముళ్ల కిరీటాలు'ను విన్పించి ప్రేక్షకుల్ని ఉత్తేజపరిచిన పెంకిని కళా సమితి అంతర్జాతీయ నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్ తదితరులు సత్కరించినట్లు ఆయన విలేకర్లకు తెలిపారు. సామాజిక కార్యకర్తలు ఆర్థికంగా బలోపేతమైతే, ప్రజలు మరింత చైతన్యవంతులయ్యే విధంగా సేవలందిస్తారని ముళ్ల కిరీటాలు సారాంశమని పెంకి వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు అభినందించారు.

ఉచిత దంత వైద్య శిబిరం


దంత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక చింతలపాటి బాపిరాజు హైస్కూల్‌లో రాజ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపు ప్రారంభించిన రిటైర్డ్ స్కూల్ హెచ్‌ఎం ఎస్.మునిరత్నం మాట్లాడుతూ మన అవయవాల్లో దంతాలు కూడా ప్రత్యేకత కలిగి ఉన్నాయని, వాటిపై ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. దంతాలను నిర్లక్ష్యం చేయడం ద్వారా ఆహార సమస్య ఏర్పడి, దీర్ఘకాలిక వ్యాధులు సంభవిస్తాయన్నారు. రాజ్ డెంటల్ హాస్పిటల్ వైద్యుడు బి.రాజశేఖర్ మాట్లాడుతూ శిబిరంలో 70 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్.భార్గవి, డాక్టర్ వకుల్, డాక్టర్ దుర్గ, పితాని గోపాలకృష్ణ అల్లు శ్రీనివాస్, మనోజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు మధురాతి మధురం


స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 1985-86 విద్యార్థుల కలయిక

ఆకివీడు: ఆనాటి ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం అంటూ పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆదివారం కలిశారు. పూర్వపు విద్యార్థుల కలయికతో స్థానిక పులవర్తి లక్ష్మణ స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంబరాలు నెలకొన్నాయి. పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులతో పూర్వపు విద్యార్థులు సంతోషంతో ఆలింగనం చేసుకున్నారు. గత జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ గడిపారు. ఈ సందర్భంగా 20 మంది ఉపాధ్యాయుల్ని సత్కరించారు. పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో పాఠశాలకు విద్యుత్ మోటార్‌ను బహుకరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని పూర్వపు విద్యార్థులు కాకర్ల ఫణి, గిరి, కొప్పర్తి రవి, సత్యనారాయణ, అమీర్, తోట బాబ్జీ, సన్నిధి గుప్తా తదితరులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా క్రిస్మస్ ఆరాధన పాటలు



లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాటలు పాడుతున్న దృశ్యం

ఆకివీడు: క్రిస్మస్ పాటలతో స్థానిక లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలిషిప్ చర్చి ఆవరణ భక్తి పరవశ్యం పొందింది. కార్యక్రమానికి పాలకొల్లుకు చెందిన క్రిస్మస్ వర్తమానికులు జాన్ శామ్యూల్ కార్యక్రమాన్ని ప్రారంభించి క్రిస్మస్ కేకును కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి పాటలు వినడంతో మనస్సు ప్రశాంతత పొందుతుందన్నారు. మనిషిని ఆధ్యాత్మికత వైపకు తీసుకువెళ్లుతుందని చెప్పారు. క్రిస్మస్ వర్తమానాన్ని ఆయన అందించారు. క్రీస్తు జననం ప్రపంచానికి వెలుగునింపిందని, మార్గదర్శకులయ్యారని బోధించారు. కార్యక్రమానికి చర్చి అధ్యక్షుడు జయంతిరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బ్రదర్స్, సిస్టర్స్ క్రిస్మస్ పాటలు పాడారు. సండే స్కూల్ విద్యార్థులు నాటికలు ప్రదర్శించారు.

నేడు ధర్మాపురంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపుర అగ్రహారంలో సోమవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని వార్డు కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ ఆదివారం చెప్పారు. గ్రామానికి చెందిన సుప్రీంకోర్టు మాజీ జడ్జి స్వర్గీయ కటికతల రామస్వామి విగ్రహావిష్కరణ, విశ్రాంతి భవనం, ధర్మాపురం స్వాగత బోర్డుల్ని ఆవిష్కరణ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా అదనపు డీఐజీ పీ.వీ.సునిల్ కుమార్ హాజరవుతారని వెస్లీ చెప్పారు. కార్యక్రమానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్, ఎస్పీ రవి ప్రకాష్, కౌన్సిలర్లు హాజరవుతారని తెలిపారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుమంట్ర: ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చునని పశ్చిమ గోదావరి జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ అన్నారు. ఆదివారం పెనుమంట్ర పిరిమిడ్ ధ్యాన శిక్షణ కేంద్రంలో ఉపసర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన మెగా మహాకరుణ-శాకాహారుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శాకాహార ప్రాధాన్యతను తెలిపారు. ముందుగా పెనుమంట్ర, గరువు, బ్రాహ్మణచెర్వు గ్రామాలలో 15 కిలోమీటర్ల మేర శాకాహార ర్యాలీని నిర్వహించి పిరిమిడ్ కేంద్రంలో ఉచిత ధ్యాన శిక్షణ, సంగీత నాద జ్ఞానం, చిన్నారులతో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమి చైర్మన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, జిల్లా శాకాహార ర్యాలీ కన్వీనర్ కేవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి మాజీ మంత్రి రంగనాథరాజు ఆపన్న హస్తం

పెనుగొండ: విధి వక్రీకరించడంతో కొడుకు , కోడలు, భర్తను పోగొట్టుకుని ముదసలి వయస్సులో మనమళ్లను సాకుతున్న అవ్వకు అండగా నిలిచి ప్రతి నెలా రూ.10వేలు అందిస్తూ మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మనసున్న మారాజుగా అభినందనలు అందుకుంటున్నారు. ఆచంట మండలం అయోధ్యలంక పెదపేటకు చెందిన బొంతు వెర్రమ్మ భర్త, కొడుకు, కోడలు స్వల్ప వ్యవధిలోనే మృతి చెందడంతో విషయాన్ని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో గత ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. వెర్రమ్మకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ.2750కి తోడుగా, శ్రీరంగనాథరాజు అందిస్తున్న రూ.10వేలుతో కలిపి మనమళ్లు ప్రణ్ కుమార్, సతీష్‌లను సాకుతుంది.

డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

భీమవరం: డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశం లో 2024-25 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి శివరామరాజు, అధ్యక్ష కార్యదర్శులుగా కటికల పల్లారావు, పాకలపాటి సీతారామరాజు, ట్రెజరర్‌గా కనగర్ల రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితోపాటు జాలీ వాకర్‌గా అప్పలరాజు, పీఆర్ఓగా కొప్పినీడి సూర్య ప్రకాష్ ,ఉపాధ్యక్షులుగా ఎస్.త్యాగరాజు, కె.రాంబాబు, జాయింట్ సెక్రటరీలుగా కె.రామచంద్రరావు, అడపా బాబ్జీ, సభ్యులుగా పది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైతుల శ్రమదానం


గరగపర్రు మురుగు కాలువలో చెత్తాచెదారం తీస్తున్న దృశ్యం

పాలకోడేరు: గరగపర్రు మురుగుకాలువ చెత్త, తూడు, గుర్రపుడెక్కతో నిండి పోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చేలల్లో నిలిచిపోయిన నీరు లాగడం లేదు. దాంతో సార్వా వరి పంట పాడవడమే కాక, నారు మళ్లు దెబ్బ తినే పరిస్థితి ఏర్పడింది. ఈ గరగపర్రు కాలువ ఆయకట్టు పైనే యండగండి, చిలుకూరు, ఉప్పులూరు, గరగపర్రు గ్రామాల వరి చేలు ఆధారపడ్డాయి. దీంతో గరగపర్రు రైతులు చింతలపాటి వెంకట సుబ్బరాజు, నంబూరు ఏడుకొండల రాజు, పచ్చమట్ల వెంకటరాజు, మేకల చంద్రరావు తదితరులు ముందుకొచ్చి సొంత ఖర్చులతో ప్రొక్లైనర్ ఏర్పాటు చేసుకుని, కాలువలోని తూడు తొలగిస్తున్నారు. అధికారులు కూడా తమకు అండగా ఉండి సహకరించాలని కోరుతున్నారు.

జైన్ దేవాలయంలో అడిషినల్ ఎస్పీ పూజలు


జైన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న అడిషినల్ ఎస్పీ సుబ్బరాజు

కాళ్ల: మండలంలోని పెదఅమిరం గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ ఆదినాథ్ భగవాన్ జైన్ దేవాలయాన్ని ఆదివారం జిల్లా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో ప్రశాంతత కలిగిందన్నారు. ఆలయ చరిత్ర, జైన్ తీర్థంకరుల వివరాలను జైన్ సంఘం నాయకులు హాస్ముక్ లాల్ జైన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, ఆలయ కార్యదర్శి వినోద్ జైన్, జైన్ సమాజ్ నాయకులు ప్రకాష్ జైన్, ప్రమోద్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: నరసాపురం డిపో పరిధిలో ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్‌జసుబ్బన్నరెడ్డి చెప్పారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పెనుగొండ ప్రాంతాల ప్రజలు సమస్యలు, సూచనలను ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బస్సు సర్వీస్‌లు, ప్రధానంగా ఉన్న సమస్యలు, కార్గో సేవలపై ఫిర్యాదులు, సూచనలు ఇవ్వాలని కోరారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల అండ

పెనుగొండ: సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆర్థికంగా అండగా నిలిచారు. సిద్ధాంతానికి చెందిన దేవానీ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండంతో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), సీహెచ్ నాగరాజు, పి.పోతు రాజు, జి.బాబూరావు, కె.సుబ్బు తదితరులు పాల్గొన్నారు.